# సినీ బేతాళ కథలు





## – డా. కె.వివేకానందమూర్తి

*ఒకప్పటి మిమిక్రీ ఆర్టిస్ట్, సినీనటుడు, సినీపత్రికా సంపాదకుడు, ఇప్పటికీ చక్కటి కథారచయిత, విదేశంలో తెలుగు వైద్యుడు.. డా.కె.వివేకానందమూర్తిగారు నెలకో సినీ బేతాళ కథ చెప్పడం ప్రారంభించారు. డాక్టర్‌గారి కలం నుంచి నెలకో బేతాళ కథ ..కౌముది పాఠకుల కోసం ప్రత్యేకం..!!*

### - 23 -

### - పరపతి -

**విక్రమార్కుడు,** బేతాళుడి శవాన్ని తన భుజం మీద వేసుకుని మళ్లీ నడక సాగించాడు.

'విక్రా! నీకు శ్రమ కలుగకుండా వుండేందుకు మరో కథ చెబుతాను విను.' అని బేతాళుడు ప్రారంభిచాడు.

"ఆ మధ్య గిలిగింతలరాణి అని వొక హీరోయిన్ వూరింది. వూరడం అంటే వూరిపోయి లావెక్కడం కాదు. వున్న హీరోయిన్లకి పోటీగా వుద్భవించడం. ఆమె నటించిన చిత్రాలన్నీ వరసగా హిట్టయిపోయి అనతికాలంలోనే ఆమె నెంబర్ వన్ హీరోయిన్‌గా ఖ్యాతి గడించింది. గిలిగింతలరాణి కొత్త సినిమా చూడాలని ప్రేక్షకులు అన్నివేళలా గిలగిల్లాడిపోసాగారు. జీజీరాణి సినిమాలన్నింటికీ ఆమె భర్తగారే నిర్మాత. ఆయన పేరు చలపతి. చవక బడ్జెట్‌తో చాలా అవకతవక చిత్రాలు తీసాడు. ఎందుకయ్యా యిలాంటి అవకతవక చిత్రాలు తీస్తావ్ అని ఎవరేనా అడిగితే 'నేను విజయం సాధిస్తే నా ప్రేక్షకులకు నేనెవరో నాకు తెలుస్తుంది. నా సినిమా ఫెయిలయితే నా ప్రేక్షకులెవరో నాకు తెలుస్తుంది' - అనేవాడు చలపతి.

జీజీరాణి నటించే ప్రతి చిత్రంలో మెలికల మహరాజ్ హీరో. 'మెలిక తిరిగి చూడు' అనే చిత్రంతో తారాపథానికి యెగిరిన దగ్గర్నుంచీ హీరో మహరాజ్ మెలికల మహరాజ్ అయిపోయాడు. జీజీరాణి, యమ్మెమ్‌రాజ్ కాంబినేషన్లో వచ్చే అవకతవక చిత్రాలన్నీ అశేష ప్రేక్షకుల మనసుల్ని ఆకట్టేసుకుంటున్నాయి. అనేక చిత్రాల్లో కలిసి నటిస్తూ జీజీరాణి, యమ్మెమ్‌రాజ్ బాగా దగ్గరైపోయారు. క్రమంగా షాట్ బ్రేక్స్‌లో యిద్దరూ సెట్లోంచి మాయమయి, మేకప్‌రూమ్‌కి వెళ్లిపోయేవారు.

'నీ యాక్టింగుతో జనాలకి గిలిగింతలెటేత్తావే' అనేవాడు యమ్మెమ్‌రాజ్.

'నివ్వు మాతరం - నీ మెలికల గంతుల్తో ఆల్లని అదే పనిగా వూపవేంటి?'అని మెచ్చుకునేది జీజీరాణి.

ఓసారి చలపతి 'కర్ణోదయం' అనే యితిహాస చిత్రం మొదలెట్టాడు. జీజీరాణిది కుంతీదేవి వేషం. యమ్మెమ్‌రాజ్‌ది దూర్వాసుడి వేషం. దూర్వాసుడి ఐఫోన్‌లో ఫేస్‌బుక్కూ, వాట్సప్ వగైరాలు నొక్కుతూ సపర్యలు చెయ్యడానికి కుంతీదేవిని పంపిస్తారు.

దూర్వాసుడు తన మొలతాడుకి కట్టుకున్న ఐఫోను అందుకునే ప్రక్రియలో కుంతీదేవి ఋషిగారి తొడమీద చెయ్యేస్తుంది. వెంటనే దూర్వాసుడికి వొళ్లంతా టివటివలాడి కర్ణుడు పుట్టేస్తాడు. – 'కర్ణుడెవరని అడిగితే ఆ సూరిగాడికి పుట్టాడని చెప్పు, కావాలంటే నా ఐఫోనుంచుకో. నేను వీడి తండ్రిని అని ఎవరితో అనకు. అన్నావో నీకు టివటివ శాపం పెట్టి యింకెవరూ పుట్టకుండా చేస్తాను. అప్పుడు పాండవులు, భారతం ఏవీ వుండవు. కృష్ణుడు గోలెట్టేస్తాడు.' అని దూర్వాసుడు తపస్సుకి వెళ్లిపోతాడు. సూర్యుడు,' ఫర్లేదులే – నా పేరు చెప్పెయ్యి. రాత్రిళ్లు చంద్రుణ్ని కవర్ చెయమని పురమాయించి, నిన్ను అడపాదడపా సెకండ్‌షోలకి తీసుకెళ్తాను' అని కుంతీదేవికి హామీ యిస్తాడు.

ఇదేం స్టోరీలైనయ్యా నీ మొహం మండా! అందుకే నీ సినిమాలన్నీ అవకతవక సినిమాలు – అని సాటి స్నేహితులు తలబాదుకున్నారు. 'ఏం ఫర్లే – మా జీజీ – గిలిగింతలు, ఆ యమ్మెమ్‌గాడి మెలికల గంతులు వుంటే చాలు – ఆల్లే చూత్తారు' అన్నాడు నిర్మాత చలపతి.

స్టూడియోలో షాట్ రెడీ చేసుకుంటున్నారు. నిర్మాత చలపతి, జీజీరాణి భర్త అనగా గిలిగింతలరాణి మొగుడు తనే తన అవకతవక చిత్రానికి దర్శకత్వం తలపెట్టాడు.

సెట్లో హీరో, హీరోయిన్ కనిపించడంలేదు. లోపల బైటా వెదికారు. ఎక్కడా కనిపించకపోతే యిక మేకప్ రూమ్‌లో వున్నారేమోనని అక్కడికి చేరాడు చలపతి. మేకప్ రూంలో తను చూసిన దృశ్యానికి షాకయిపోయాడు చలపతి.

కుంతీదేవి జీజీరాణి, దూర్వాసుడు యమ్మెమ్‌రాజ్ వొకటయిపోయినవారల్లా కంగారుగా చలపతి ఎంట్రీతో విడివిడిగా విడిపోయారు. ఆ కంగారులో దూర్వాసుడి గడ్డం, కుంతీదేవి ముఖానికి అతుక్కుపోయింది. కోపంతో చలపతి జీజీరాణి గడ్డం పీకేసి, 'ఏవిటిది?' అనడిగాడు.

'గడ్డం' అంది రాణి.

'అది నాకు తెలుసు. కానీ యీడి గడ్డం నీ ఫేసుకి యెలా అతుక్కుంది?' చలించి పోతూ అన్నాడు చలపతి.

'స్సారీ డాళింగా! నివ్వే మారేసంలో వున్నావనుకున్నా'

'మారేసాలు బొమ్మలో పాత్తర్లకే తెలీవు. చూసేటోల్లందరికీ తెలుత్తాయి. అయినా నాలో యేం తక్కువైంది. ఈ మెలికల రాజ్‌గాడ్ని తగులుకున్నావ్. నిన్ను పెద్ద వీరోయిన్ని సేసా. యిండస్ట్రీలో యీ యిసయం నలుగురికీ తెలిత్తే నీ పరపతి ఏటవుద్ది? యింకా ఏటో అవటం ఏటి? యిప్పుడు నీకు పరపతి జీరో' అని కోపంతో వూగిపోయాడు జీజీరాణి భర్త చలపతి.

యమ్మెమ్‌రాజ్ మెమెమ్మే అంటూ గడ్డం వూడిపోయిన గడ్డాన్ని తడుముకున్నాడు.

– "అదీ విక్రమార్కా! జరిగిది. యిప్పుడు గిలిగింతలరాణి తన భర్తకు ఏ సమాధానం చెప్పింది?

ఇండస్ట్రీలో ఆమె తన పరపతిని పోగొట్టుకుందా? ఈ ప్రశ్నలకు నువ్వు తెలిసీ సమాధానం చెప్పకపోయావో నీ తల నిర్మాత చలపతి తలలా వర్రీతో వాచిపోయి అవకతవగ్గా అనేక వేల ముక్కలైపోతుంది –" అని బేతాళుడు ముగించాడు.

అప్పుడు బదులుగా విక్రమార్కుడు – 'ఓ బేతాళా! గిలిగింతల రాణి పరపతి శూన్యురాలు కాలేదని ఆమె తన భర్త చలపతి కిచ్చిన జవాబే క్లారిటీ యిస్తుంది. జీజీరాణి చెప్పిన రిప్లై యిది – 'రేయ్ సలపతీ! నా పరపతికేం డోకాలేదు. ఇదుగో యీ మెలికల రాజే నా పరపతి. అంటే నువ్వు పతి, యీడు పరపతి – నా పరాయి పతి. దేవులపల్లోరు పంచదార కంటే పరదార తీపి అన్నారని మీ మొగనాకొడుకులు సెకండ్ సెటప్పులు, తరుడు సెటప్పులు సైడంలా! యిడియోరిలీజులకీ, టివీ టాకులకీ, యింకా యింకా సబలకీ అసలు పెల్లాన్ని అబల్ని సేసి, సెటప్పు శాల్తీల్ని తోలుకెల్లట్లా? మగాడికో నీతి, ఆడంగులకో రీతి అట్ట రన్నేయం'

– అని వుద్వేగంగా గిలిగింతలరాణి, చలపతిని చెరిగేసింది.

-కామ ఏషః క్రోధ ఏషః
రజోగుణ సముద్భవః|
మహాశనో మహాపాప్మా
విద్ధ్యేన మిహవైరిణమ్||

రజోగుణము వలన కామము పుట్టును. దీనికి ఎంత అనుభవించిననూ తృప్తిలేదు. ఇదియే అడ్డగింపబడి ఘోరపాపములు చేయించును. ఇది జ్ఞానానికి ముఖ్యశత్రువు.

--అన్నారోయ్ గీతాచార్యులు, శ్రీకృష్ణభగవానుడు -" అని ముగించగానే రాజుకి మౌనభంగం కలిగి బేతాళుడు ఎగిరి మళ్లీ చెట్టెక్కేశాడు.

***(వచ్చేనెలలో మరోకథ)***

Post your comments